www.prajapaksham.in
ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
సోమవారం | 26 | మే | 2025
పేజీలు 7

## గుండెపోటుతో దారా బాలరాజు మృతి



- నివాళులర్పించిన డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క, నందిని



3 లో

# మన బహుళ అంతస్తులు పదిలమేనా..?



**వరుస అగ్ని ప్రమాదాలతో ప్రజల్లో ఆందోళన**
**-కొరవడిన పర్యవేక్షణ**
**-కాసులతో ముడిపడిన నిరభ్యంతర ధృవీకరణ**

**ప్రజాపక్షం/ఖమ్మం :** రాష్ట్రంలో హైదరాబాద్ మహా నగరం తర్వాత బహుళ అంతస్తుల భవనాలు ఖమ్మం నగరంలోనే ఎక్కువ. హైదరాబాద్ సహా పలు నగరాల్లో జరుగుతున్న వరుస అగ్ని ప్రమాదాలు, ఆ సందర్భంగా జరుగుతున్న మరణాలు ప్రజల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. మన భవనాలు పదిలమేనా అన్న భావన బహుళ అంతస్తుల భవనాల్లో నివసిస్తున్న వారిలో కలుగుతుంది. ఖమ్మం నగరంలో విద్యాలయాలు, ఆసుపత్రులు, షాపింగ్ మాల్స్, కార్పొరేట్ కార్యాలయాలు అన్నింటికి మించి నగరంలో 20 శాతానికి పైగా జనం బహుళ అంతస్తుల్లో నివసిస్తున్నారు. ప్రాథమిక విద్యను అందిస్తున్న పలు ప్రైవేటు విద్యాలయాలు సైతం బహుళ అంతస్తుల భవనాల్లో నిర్వహిస్తున్నారు. నగరంలో విస్తరించిన బహుళ అంతస్తుల నిర్మాణాల్లో అగ్ని ప్రమాదాల నియంత్రకాల ఏర్పాటు ఎలా ఉంది అన్నది ఇప్పుడు చర్చనీయాంశమైంది. బహుళ అంతస్తుల నిర్మాణాలకు సంబంధించి అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు రక్షణ చర్యలు చేపట్టే వ్యవస్థను ఏర్పాటు చేశారా అవి పని చేస్తున్నాయా వీటిని పర్యవేక్షించాల్సిన ఫైర్ సేఫ్టీ అధికారులు పర్యవేక్షిస్తున్నారా అంటే అన్ని ప్రభుత్వ విభాగాల మాదిరిగానే ఈ వ్యవస్థ తయారైందన్న సమాచారం. పసి పిల్లలు చదివే విద్యాలయాలు కమర్షియల్ కాంప్లెక్స్‌ల పైన మూడు, నాలుగు అంతస్తుల్లో నిర్వహిస్తుంటే ఆట స్థలం సహా అన్ని ఉన్నట్లు విద్యాశాఖాధికారులు ధృవీకరిస్తున్నారు. అలాగే అగ్నిప్రమాద నిరోధక వ్యవస్థ లేకుండానే అంతా సక్రమంగా ఉన్నట్లు ఫైర్ సేఫ్టీ అధికారులు ధృవీకరిస్తున్నారు. ఖమ్మం నగరంలో ఆసుపత్రులన్ని బహుళ అంతస్తుల భవనాల్లోనే నిర్వహిస్తున్నారు. వీటన్నింటిలో అగ్నిప్రమాద హెచ్చరిక సామాగ్రిని అమర్చారా, అగ్నిప్రమాదం జరిగితే రోగులు ప్రాణాలు కోల్పోకుండా కాపాడే వ్యవస్థ ఉందా అంటే ఆలోచిస్తున్నారు. బహుళ అంతస్తుల భవనాలకు సంబంధించి పైన అంతస్తులు నిర్మాణంలో ఉండగానే క్రింది అంతస్తుల్లో విద్యాలయాలు, ఆసుపత్రులు, వ్యాపార సముదాయాలను ఏర్పాటు చేస్తున్నారు. వీటికి అనుమతులు

మిగతా 2లో..

## నర్సరీలను వదిలేశారా..!?



**-వృథా అవుతున్న ప్రజా ధనం**
**-నర్సరీలలో ఎండిపోతున్న మొక్కలు**

**ప్రజాపక్షం/ఖమ్మం :** గత ప్రభుత్వం ప్రతి గ్రామ పంచాయతీలోనూ నర్సరీలను ఏర్పాటు చేసి నర్సరీలలో పెంచిన మొక్కలను హరితహారం కార్యక్రమానికి ఉపయోగించే వారు. గ్రామాల్లో, పట్టణాల్లో నర్సరీల ద్వారా పెంచిన మొక్కలే హరితహారంలో ఉపయోగించే వారు. ప్రతి గ్రామ పంచాయతీలోనూ మిగిలిన వ్యవహారం ఎలా ఉన్న నర్సరీల నిర్వహణ మాత్రం ఫర్వాలేదనిపించే స్థితిలో ఉంది. కానీ ఇప్పుడు గ్రామ పంచాయతీల పాలక వర్గాలు లేకపోవడం ప్రభుత్వానికి కూడా నర్సరీలపై కూడా అంతగా దృష్టి లేకపోవడంతో నర్సరీలు ఎండిన మొక్కలతో

మిగతా 2లో..

## ఆరెకోడుతండలో విషాదం

**విషాహారం తిని సుమారు 75 జీవాలు మృతి**



2 లో

## జీవాల రైతులకు న్యాయం చేయండి : బాగం



3 లో

# మన బహుళ అంతస్తులు పదిలమేనా..?

(మొదటిపేజీ తరువాయి)
ఎలా తీసుకున్నారు, ఎలా ఇచ్చారన్న ప్రశ్నకు సమాధానం దొరకదు. కానీ ఖమ్మంలో నిర్మించిన బహుళ అంతస్తుల నిర్మాణాలకు సంబంధించి అన్నింటికి అగ్నిప్రమాద నిరోధకాలు ఏర్పాటు చేసినట్లు, భవనంలో ఎక్కడ ప్రమాదం జరిగినా అందరికీ తెలిసేవిధంగా అలారం సిస్టం ఏర్పాటు చేసినట్లు భవన యజమానుల వద్ద ఫైర్ స్టేఫీ అధికారులు ఇచ్చిన ధృవీకరణ పత్రాలు మాత్రమే ఉన్నాయి. ఏమి ఉన్నా లేకపోయినా కాసులతో ఫైర్ సేఫ్టీ ధృవీకరణను తెచ్చుకోవచ్చునన్న భావనను భవన నిర్మాణ సంస్థల్లోనూ, యజమానుల్లోనూ బలపడింది. ఇది ప్రాణాలతో చెలగాటమనే విషయాన్ని అధికార యంత్రాంగం మరిచిపోతుంది. ఇటీవల బుర్హాన్‌పురంలో ఒక బహుళ అంతస్తుల భవనంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదం జరిగి పొగ కమ్ముకుంటే ఏమి చేయలేని స్థితి. ఆ సమయంలో భవనంలో ఎవరు లేరు కాబట్టి సరిపోయింది ఒకవేళ ఉండి ఉంటే పరిస్థితి ఏమిటన్నదానికి సమాధానమే లేదు. తక్షణ అవసరం లేకపోయినా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేసి అమర్చినట్లు శారీరక వైకల్యం లేకపోయినా పరీక్షించకుండా 50 శాతం అంగవైకల్యం ఉన్నట్లు ధృవీకరించినట్లు, అంతా బాగున్నా ఆపరేషన్ అవసరం సెలవు మంజూరు చేస్తే మంచిదని వైద్యుడు ధృవీకరించి మెడికల్ సర్టిఫికెట్ ఇచ్చినట్లు ఫైర్‌సేఫ్టీ అధికారులు సైతం భవనాలు పరిశీలించకుండానే కార్యాలయాల్లో తమను తృప్తి పరిస్తే ధృవీకరణ ఇచ్చేస్తున్నారు. ఖమ్మం నగరంలో ఎన్ని బహుళ అంతస్తుల భవనాలు ఉన్నాయి, ఎన్నింట్లో ఫైర్‌సేఫ్టీ సిస్టం ఉంది అని పరిశీలిస్తే మన అధికారుల తీరు బయటపడుతుంది. ఇప్పటి వరకు ప్రమాదాలు జరగలేదు కాబట్టి సరిపోయింది. జరిగితే...? మొన్న హైదరాబాద్ అగ్ని ప్రమాద ఘటన తర్వాతనైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు దీనిపై దృష్టి సారించాల్సి ఉంది. బహుళ అంతస్తుల భవనాల్లో సిసి కెమెరాలు అనుమతి తప్పనిసరి అని పోలీస్ శాఖ హెచ్చరించి ఆయా భవన యజమానులు, నివాసితులతో సమావేశాలు ఏర్పాటు చేసినా ఆశించిన ఫలితం దక్కలేదు. ఇప్పటికైనా చేతులు కాలాక ఆకులు పట్టుకున్న సామెతలా కాకుండా బహుళ అంతస్తులను సంబంధిత అధికారులు పరిశీలించి ఫైర్ సేఫ్టీ సిస్టం ఏర్పాటు చేసేవిధంగా తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



# నర్సరీలను వదిలేశారా..!?



(మొదటిపేజీ తరువాయి)
వెలవెలపోతున్నాయి. ప్రత్యేకాధికారులు నర్సరీల గురించి పట్టించుకునే స్థితిలో లేరు. ఇప్పటికే ప్రతి నర్సరీకి వేలాది రూపాయలు ఖర్చు చేసినా సంరక్షణ లేక మొక్కలు ఎండిపోతుండడంతో ప్రజా ధనం వృధా అవుతుంది. ఏదులాపురం మున్సిపాలిటీగా ఏర్పాటు చేస్తూ పలు గ్రామ పంచాయతీలను ఈ మున్సిపాలిటీలో విలీనం చేశారు. గతంలో బారుగూడెం పంచాయతీ పరిధిలోని శ్రీసిటీలో నర్సరీని ఏర్పాటు చేసి మొక్కలు పెంచి గ్రామ పంచాయతీ పరిధిలో పచ్చదనం కోసం నాటే వారు. కానీ ఇప్పుడు ఆ నర్సరీని పట్టించుకునే వారు లేక సంరక్షణ కరువై మొక్కలు ఎండిపోతున్నాయి. అసలు ప్రభుత్వమే నర్సరీలను వదిలేసిందా లేక అధికారులే నిర్లక్ష్యంతో వదిలేశారా అన్నది తేలాల్సి ఉంది. ఒకవేళ ప్రభుత్వమే వదిలేస్తే అప్పుడప్పుడు నర్సరీలలో పని చేసేందుకు కూలీలను తీసుకు రావడం వృధా ఖర్చుగా మిగులుతుంది. ఒకవేళ నర్సరీల సంరక్షణ విషయంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉంటే నర్సరీలను నిర్లక్ష్యానికి వదిలేసినా అధికారులపై తగు చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది.

# ఆరెకోడుతండలో విషాదం

**-విషాహారం తిని 75 జీవాలు మృతి**
**- ఘటన స్థలాన్ని పరిశీలించిన సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, సిపిఐ శ్రేణులు**
**-ప్రభుత్వం తరుపున ఆదుకోవాలని విజ్ఞప్తి**



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** పొలంలో మేతకు వెళ్లిన 75 జీవాలు మృతి చెందిన విషాదకర సంఘటన ఖమ్మంరూరల్ మండలంలోని ఆరెకోడుతండలో ఆదివారం చోటు చేసుకుంది.గ్రామానికి చెందిన మాలోత్ హరిదాస్, బానోత్ బాలాజీ, బోడ సరస్వతి, బానోత్ రామ్లా, మాలోత్ గోపి, గుగులోత్ కిరణ్, బానోత్ శంకర్‌తో పాటు తదితరులకు చెందిన సుమారు 600ల జీవాలను రోజువారిలాగానే మేతకు తోలారు. కాగా అవి ఆ గ్రామానికి చెందిన ఓ రైతు బెండతోటలో మేస్తునే నురుగలు కక్కుంటూ కింద పడిపోయాయి. మృతి చెందిన జీవాలను అక్కడే వదిలేసి, ఊపిరితో కొట్టుకుంటున్న జీవాలను ఖమ్మంలోని పశువైద్యశాలకు తరలించారు. గమనించి వైద్యులు విషతుల్యమైన ఆహారం తినడం వలన మృత్యువాత పడినట్టుగా తెలిపారు. జరిగిన ఘటనతో జీవాలను కోల్పోయిన బాధితులు కన్నీరు మున్నీరుగా విలపించారు. జీవాలను కోల్పోయి తమ బ్రతుకులు రోడ్డున పడ్డాయని, ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమపై దయచూపి నష్టపరిహారం అందించాలని వేడుకున్నారు.

**బాధితులకు న్యాయం చేయాలి : దండి**

తమ జీవనాధరమైన జీవాలను కోల్పోయిన నిరుపేద గిరిజనులకు ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని సిపిఐ జిల్లా సహాయాకార్యదర్శి దండి సురేష్ డిమాండ్ చేశారు. తమ జీవనాధరమైన జీవాలు కోల్పయిన గిరిజనులకు సీఎం సహాయనిధి నుంచి తక్షణమే ఆర్థికసాయం అందించాలన్నారు. అలాగే మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. భారత కమ్యూనిస్టు పార్టీ తరుపున తమ వంతుగా వారికి ఆర్థికసాయం అందిస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అజ్మీరా రామ్మూర్తి నాయక్, జిల్లా సమితి సభ్యులు యడ్లపల్లి శంకరయ్య, మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్, మండల సమితి సభ్యులు ఏలూరి భాస్కర్, సిపిఐ శాఖ నాయకులు మోహన్‌చంద్ర, మల్సూర్, సీతారాములు, హరిదాస్, శివ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఎనిమిదిన ఆర్యవైశ్య మహాసభ ప్రమాణస్వీకారం



**ప్రజాపక్షం/ఖమ్మం :** ఆర్యవైశ్య మహాసభ నూతన కమిటీ ప్రమాణస్వీకారం జూన్ ఎనిమిదిన కల్లూరులో జరుగుతుందని ఆర్యవైశ్య మహాసభ ఖమ్మంజిల్లా అధ్యక్షులు పసుమర్తి చందర్‌రావు తెలిపారు. ఆర్యవైశ్య మహాసభ నూతన కమిటీ ప్రమాణస్వీకారం ఏర్పాట్లు, తదితర విషయాలపై చర్చించేందుకు ఆదివారం ఖమ్మం వాసవీమాత ఆలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమావేశంలో చందర్‌రావు మాట్లాడుతూ వెనకబడిన ఆర్యవైశ్యులకు న్యాయం జరిగేవిధంగా సంక్షేమ కార్యక్రమాలు ప్రభుత్వం నుంచి అందేలా కృషి చేస్తామన్నారు. మహాసభ కమిటీ ప్రమాణస్వీకారానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు అమరవాది లక్ష్మి నారాయణ, అతిథులుగా ధన్‌వాల్ సూర్యనారాయణ, జగ్గయపేట శాసనసభ్యులు శ్రీరాం తాతయ్య, సుజాత గుప్తా, ఉప్పల శారద తదితరులు పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశంలో ఖమ్మం నగర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు వనమా సూరి, ప్రధాన కార్యదర్శి వనమా కిరణ్ కుమార్, రాధాకృష్ణమూర్తి, పసుమర్తి వెంకటేశ్వరరావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

# మార్చురీలోనే నంబాల మృతదేహం

**-మరణం తర్వాత వీడని చిక్కుముడి**



**ప్రజాపక్షం/ఖమ్మం :** 75 సంవత్సరాల పాటు జీవించిన నంబాల కేశవరావు 55 సంవత్సరాల పాటు సాయుధ పోరాటంలో పలు కీలక బాధ్యతల్లో పనిచేస్తూ అనేక హింసాత్మక ఘటనలకు నాయకత్వం వహించారు. అదే సమయంలో పలుమార్లు నంబాల కేశవరావుపై విస్తృత స్థాయిలో చర్చ జరిగింది. ఈనెల 21న ఛత్తీస్‌ఘఢ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో నంబాల కేశవరావు అలియాస్ బసవరాజు మృతి చెందగా మరో 20 మంది మావోయిస్టులు మృతి చెందిన విషయం విధితమే. ఇప్పటి వరకు 22 మృతదేహాలను బంధుమిత్రులకు అప్పగించారు. నంబాల మృతదేహం అప్పగింతపై తీవ్ర స్థాయిలో చర్చ జరుగుతుంది. నంబాల ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లాకు చెందిన వారు కావడంతో మృతదేహాన్ని శ్రీకాకుళంకు తరలిస్తే శాంతి భద్రతలకు విఘాతం కలుగుతుందని అక్కడి పోలీసులు ఛత్తీస్‌ఘఢ్ ప్రభుత్వానికి లేఖ రాశారు. ఇదే సమయంలో పౌర హక్కుల సంఘం, అమరవీరుల బంధుమిత్రుల సంఘం నంబాల మృత దేహాన్ని వారి కుటుంబ సభ్యులకు అప్పగించాలని ఆంధ్రప్రదేశ్ హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు నంబాల మృతదేహాన్ని అప్పగించాలని పోలీసులకు సూచించింది. కానీ ఛత్తీస్‌ఘఢ్ అడ్వకేట్ జనరల్ మాట్లాడుతూ ఛత్తీస్‌ఘఢ్ ప్రభుత్వానికి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఎలా సూచనలు ఇస్తుందని ప్రశ్నించారు. దీనితో నంబాల మృతదేహం అప్పగింత మళ్లీ సమస్యాత్మకమైంది. ఇప్పటి వరకు ఛత్తీస్‌ఘఢ్ రాష్ట్రం నారాయణపూర్ పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో కేశవరావు మృతదేహం ఉన్నట్లు సమాచారం. ఎన్‌కౌంటర్ జరిగిన ఐదురోజులు కావడం నంబాల కేశవరావు మృతదేహాన్ని గుర్తించిన తర్వాత కూడా మృతదేహం అప్పగింతపై తర్జన భర్జనలు జరుగుతున్నాయి. బంధుమిత్రులు, పౌర హక్కుల సంఘాలు సుప్రీం కోర్టును ఆశ్రయించే పనిలో ఉన్నాయి. ఇదిలా ఉండగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా మృతదేహాన్ని శ్రీకాకుళం తరలిస్తే శాంతిభద్రతల సమస్య తలెత్తుతుందని మృతదేహాన్ని ఇక్కడకు తరలించ రాదని సుప్రీం కోర్టును ఆశ్రయించే పనిలో ఉన్నారని సమాచారం. మొత్తంగా మధ్య భారతంలో సాయుధ పోరాటానికి ఒక ఊపును, రూపును ఇచ్చిన నంబాల కేశవరావు మరణం, మృతదేహం అప్పగింత కూడా చర్చనీయాంశమే అయింది. ఎన్‌కౌంటర్‌లో మరణించ లేదని ఒడిశా ఆసుపత్రిలో షుగర్ వ్యాధికి చికిత్స పొందుతున్న కేశవరావును పట్టుకువచ్చి హింసించి చంపారని ఒక వైపు ఆరోపణలు, మరో వైపు మృతదేహం అప్పగింతపై రెండు ప్రభుత్వాలు కేశవరావు బంధుమిత్రుల మధ్య వివాదం నడుస్తుంది. దీనిపై అంతిమంగా ఎవరు ఏ నిర్ణయం తీసుకుంటారో వేచి చూడాల్సి ఉంది.

# ఓల్డ్ పోలీస్ లైన్ ఫ్రెండ్స్ ఆత్మీయ సమ్మేళనం



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఓల్డ్ పోలీస్ లైన్ ఖమ్మం ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం సన్మాన కార్యక్రమం జరిగింది. శ్రీనివాస్ నగర్ బృందావన్ గార్డెన్ నందు జరిగిన ఈ కార్యక్రమంలో రిటైరైన వారిని సన్మానించారు. పాత పోలీస్ మిత్రులంతా కలిసి ఆనందంగా వారి వారి తీపి జ్ఞాపకాలను పంచుకున్నారు. సాయంత్రం వరకు సరదాగా గడిపారు. ఓల్డ్ పోలీస్ లైన్ ఫ్రెండ్స్ 200 క్వార్టర్స్‌లో ఉన్న వారి తల్లిదండ్రుల పిల్లలతో వాట్సాప్ గ్రూప్‌ను క్రియేట్ చేశారు. సమ్మేళన కార్యక్రమానికి పాషా, శ్రీనివాస్, సుజావుద్దిన్, రిటైర్డ్ అడిషనల్ డిసిపి రవికుమార్, ఉమాశంకర్ సారధ్యంలో నిర్వహించిన ఈ సమ్మేళనంలో 300 మంది పాల్గొన్నారు.

# జీవాల రైతులకు న్యాయం చేయండి

**-సిపిఐ నేత బాగం**



ప్రజాపక్షం/ఖమ్మం : ఆరెకోడు తండాలో విషహారం తిని పదుల సంఖ్యలో జీవాలు మృతిచెందాయని, ఆ రైతులకు న్యాయం చేయాలని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఖమ్మం రూరల్ మండలం ఆరెకోడు తండాలో విషహారం తిని వందల సంఖ్యలో జీవాలు అనారోగ్యానికి గురి కాగా అందులో 75 జీవాలు మృతిచెందాయి. రైతులు విషహారం తిని అనారోగ్యానికి గురైన జీవాలను ఖమ్మం రాపర్తి నగర్‌లోని పశువుల ఆసుపత్రికి తరలించారు. కడుపు ఉబ్బి వెంటనే ప్రాణాలను కోల్పోయి. ఆసుపత్రికి బాగం హేమంతరావు, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, రైతు సంఘం బాధ్యులు యడ్లపల్లి శంకరయ్య తదితరులు చేరుకుని రైతులను ఓదార్చారు. వైద్యులతో మాట్లాడారు. జీవాల మృతికి పోస్టుమార్టం చేస్తే తప్ప కారణం చెప్పలేమన్నారు. ఆరెకోడు తండాలో 20 కుటుంబాలకు చెందిన రైతులు సుమారు 300 జీవాలను కలిపి మేతకు తోలుకుని వెళ్లారు. జీవాలు ఏమి తిన్నాయో కానీ కడుపుఉబ్బి 75 వరకు చనిపోగా మిగిలినవి ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాయి. ఈ సందర్భంగా హేమంతరావు మాట్లాడుతూ జీవాల రైతులందరూ నిరుపేదలని జీవాలపై ఆధారపడి జీవిస్తున్నారని ప్రభుత్వం తక్షణం పరిహారం అందించి తిరిగి జీవాలు కొనుగోలు చేసుకునేందుకు ఆర్థిక సాయం అందించాలని హేమంతరావు కోరారు. బాధిత రైతులను సిపిఐ నాయకులు ఓదార్చారు.

# క్యాన్సర్‌పై పరిశోధనకు డాక్టరేట్

**-అంతర్జాతీయ స్థాయిలో ప్రవీణ్‌కుమార్‌కు ప్రశంసలు**



ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : క్యాన్సర్ వైద్యం పై పరిశోధన చేసినందుకు కన్నెకంటి ప్రవీణ్‌కుమార్ డాక్టరేట్ సాధించారు. క్యాన్సర్ వైద్యంలో ఉపయోగిస్తున్న మెడిసిన్స్ కాంబినేషన్స్ కంటే ఉత్తమమైన కాంబినేషన్స్ ద్వారా ఉత్తమ ఫలితాలు సాధించవచ్చునని పరిశోధనలో తెలిపిన కన్నెకంటి ప్రవీణ్‌కుమార్‌కు హైదరాబాద్ చైతన్య డిమ్డ్ యూనివర్సిటీ డాక్టరేట్ అందజేశారు. ఖమ్మం రూరల్ మండలం తెల్దారుపల్లి గ్రామానికి చెందిన సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల దమ్మపేట ప్రిన్సిపాల్ డా॥ కన్నెకంటి వెంకటేశ్వర్లు కుమారుడు కన్నెకంటి ప్రవీణ్ కుమార్ రసాయనశాస్త్రం విభాగంలో డిసైన్ అండ్ సింతసిస్ ఆఫ్ న్యూ ఇమిడజోల్ డెరివేటీవ్స్ యాస్ యాంటీ క్యాన్సర్ ఏజెన్స్ అనే అంశంపై నాలుగు సంవత్సరాలుగా పరిశోధనలు చేశారు. ప్రొ॥ టి. నర్సింహాస్వామి పర్యేవేక్షణలో హైదరాబాద్‌లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్స్ సైన్సెస్ (ఐఐసిటి), సెంటర్ ఫర్ సెక్యూలర్ అండ్ మాలిక్యూలర్ బయాలజీ (సిసిఎంబి) సహకారంతో ప్రవీణ్‌కుమార్ చేసిన పరిశోధనలు ఉత్తమ ఫలితాలు ఇవ్వడంతో డాక్టరేట్ అందుకున్నారు. అంతేకాకుండా క్యాన్సర్ వ్యాధి ట్రీట్‌మెంట్‌లో వాడే మందులపై తాను చేసిన ప్రయోగాలను ఇంటర్నేషనల్ జర్నల్స్‌లో ప్రచురించి అంతర్జాతీయ స్థాయిలో ప్రశంసలు పొందారు. ప్రస్తుతం క్యాన్సర్ వైద్యంలో వాడుతున్న మందుల కంటే తాను సూచించిన రసాయనాల మిశ్రమాన్ని తగు మోతాదులో వాడితే క్యాన్సర్ వ్యాధిని సమర్థవంతంగా ఎదుర్కొనవచ్చునని శాస్త్రీయంగా నిరూపించినట్లు ప్రవీణ్‌కుమార్ తెలిపారు. సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌గా పని చేస్తున్న డా॥ కన్నెకంటి వెంకటేశ్వర్లు తన ఇద్దరు పిల్లలను గురుకులాల్లోనే చదివించి ఆదర్శంగా నిలిచారు. కొడుకు ప్రవీణ్ కెమిస్ట్రీలో డాక్టరేట్ సాధించగా పారా ఆప్తాలమిక్ మెడికల్ ఆఫీసర్‌గా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో సేవలను అందిస్తున్నారు. కుమార్తె కన్నెకంటి ప్రతిభ ఉద్యోగం చేస్తూ ఎకనామిక్స్‌లో డాక్టరేట్ సాధించింది. కన్నెకంటి వెంకటేశ్వర్లు తన ఇద్దరు పిల్లలు ఉన్నత విద్యను అభ్యసించి డాక్టరేట్స్ సాధించి ఎందరికో ఆదర్శంగా నిలవడం అభినందనీయమని గురుకుల పూర్వ విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. ప్రవీణ్‌కుమార్‌ను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఐఐసిటి, సిసిఎంబి పురుషోత్తం, భగవత్, సౌగంది, యశస్విని, సాయి లిఖిత, ప్రతిభ, రూపా సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# గుండెపోటుతో దారా బాలరాజు మృతి

**- నివాళులర్పించిన డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క, నందిని**



ప్రజాపక్షం/ మధిర : మధిర మండలంలోని ఆత్కూరు గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ఎస్సీసెల్ మండల అధ్యక్షులు దారా బాలరాజు(52) గుండెపోటుకు గురై అకాల మృతి చెందారు. ఆదివారం ఉదయం ద్విచక్ర వాహనంపై ఇంటి నుండి బయటకు వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో అకస్మాత్తుగా గుండెపోటుకు గురై కింద పడినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. దీనిని గమనించిన స్థానికులు, కుటుంబసభ్యులు హుటాహుటిన మధిరలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆత్కూరు గ్రామంలో ఆర్ఎంపి వైద్యునిగా జీవన ప్రస్థానాన్ని ప్రారంభించిన దారా బాలరాజు సుధీర్ఘకాలంగా కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్నారు. తొలుత కేంద్రమంత్రి ప్రస్తుత రాజ్యసభ్యురాలు రేణుకాచౌదరి అనుచరునిగా రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన బాలరాజు ఆ తర్వాత 2009 నుండి మధిర శాసనసభ్యులు డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క ముఖ్యఅనుచరుడిగా కొనసాగుతున్నారు. ఆయన కాంగ్రెస్ పార్టీలో పదవి చేపట్టిన ఎస్సీసెల్ మండల బాధ్యతలు నేటి వరకు ఆయనే కొనసాగిస్తుండటం తెలిసిందే. డిప్యూటి సిఎం అనుచరునిగా కోట్ల రూపాయల నిధులతో ఆత్కూరు గ్రామ అభివృద్ధిలో, పార్టీ విస్తరణలో ప్రజా సంక్షేమ పథకాలు అమల్లో నాయకునిగా ప్రజల మధ్య తిరుగుతూ ఓ ప్రతినిధిగా తనకంటూ ప్రత్యేకతను సాధించుకున్నారు. మధిర మండలంలో జరిగే పార్టీ కార్యకలాపాల్లో తాను పాల్గొంటూ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులల్లో ఒకనిగా తన స్థానాన్ని పదిల పర్చుకున్నారు. దారా బాలరాజు మృతి చెందాడన్న వార్త కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో, ఆత్కూరు గ్రామంలో ఆయన కుటుంబంలో, స్నేహితుల్లో విషాదచాయలు నింపాయి. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

**నివాళులర్పించిన డిప్యూటీ సిఎం భట్టి...**

దారా బాలరాజు అకామృతి పట్ల డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. మృతి వార్త తెలుసుకున్న వెంటనే హైద్రాబాద్ నుండి బయలుదేరి ఆత్కూరు గ్రామానికి చేరుకుని దారా బాలరాజు పార్థిదేహాన్ని ఆయనతో పాటు సతీమణి మల్లు నందిని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపి ఓదార్చారు. దారా బాలరాజు అకాల మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటన్నారు. కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని భరోసా కల్పించారు. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, ఇతర పార్టీల నాయకులు దారా బాలరాజు పార్థదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, అభిమానులు, ఆత్కూరు గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## విశ్రాంత పోలీస్ అధికారులకు ఉచిత హెల్త్ క్యాంపు




ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : విశ్రాంత పోలీస్ అధికారులకు ఉచిత మెగా హెల్త్ క్యాంపును నిర్వహించారు. ఖమ్మం నగరంలోని డాక్టర్ గణేష్ ఎండోకేర్ ఆసుపత్రిలో విశ్రాంత పోలీస్ అధికారుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్. రాధాకృష్ణమూర్తి, రుద్ర వెంకటనారాయణ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సంఘం గౌరవాధ్యక్షులు, మాజీ ఎంఎల్ఏ లావుడ్యా రాములు నాయక్ హాజరై వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ గణేష్ మాట్లాడుతూ విశ్రాంత పోలీస్ అధికారులకు వారి జీవిత భాగస్వాములకు, కుటుంబ సభ్యులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ఖమ్మంజిల్లాలో తనది మొట్టమొదటి ఎండోకేర్ ఆసుపత్రి అని విశ్రాంత ఉద్యోగులు, వృద్ధులు షుగర్ వ్యాధి పెరగకుండా నియంత్రణలో ఉంచుకోవాలని తెలిపారు. క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, ఆరోగ్యకరమైన ఆహారం, మందులను తీసుకోవడం చాలా ముఖ్యమన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ గణేష్‌ను సన్మానించారు.ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షులు ఎస్ సంజీవరావు, నాగేశ్వరరావు, రిటైర్డ్ సిఐలు, ఎస్ఐలు, ఏఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

## సబ్సీడిపై విత్తనాలు ఎరువులు ప్రభుత్వమే సరఫరా చేయాలి



ప్రజాపక్షం/కొణిజర్ల : సబ్సీడిపై ఎరువులు విత్తనాలు సరఫరా చేయాలని అఖిలభారత రైతుకూలీసంఘం జిల్లా నాయకులు షేక్ ఖాసిం డిమాండ్ చేశారు. కొణిజర్లలో ఆదివారం ఆయన మాట్లాడుతు కొద్దిరోజుల్లో వ్యవసాయ సీజన్ ప్రారంభం అవుతున్న తరుణంలో రైతులకు అవసరమైన ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు అందుబాటులో ఉంచే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. కార్పోరేట్ కంపెనీ ఏజెంట్లను ఏర్పాటు చేసి గ్రామాల్లో విత్తనాలు మీద ప్రచారం చేయిస్తున్నారని అన్నారు. నకిలీ విత్తనాలు అమ్మేవారిపై పిడియాక్టు కింద కేసులు నమోదు చేయాలని అన్నారు. రుతుపవనాలు ముందుగానే రావడంతో రైతులు పత్తి సాగుచేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారని తెలిపారు. వ్యవసాయశాఖ అధికారులు గ్రామాల్లో విత్తనాలు అమ్మేవారిపై దృష్టిసారించి చర్యలు తీసుకోవాలని అన్నారు. గుర్తింపు పొందిన షాపుల్లోనే విత్తనాలు కొనుగోలు చేసే విధంగా వ్యవసాయశాఖ అధికారులు రైతులను చైతన్యం చేయాలని కోరారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



ప్రజాపక్షం/కొణిజర్ల : ఆర్టీసీ బస్సు ద్విచక్రవాహనాన్ని ఢీకొని బైక్ పై ప్రయాణిస్తున్న వ్యక్తి చనిపోయిన సంఘటన మండల కేంద్రం కొణిజర్ల లో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం మండల పరిదిలోని పెద్దరాంపురం గ్రామానికి చెందిన ఇనపనూరి నాగేశ్వరరావు (35) కూతుర్ని ఖమ్మంలోని ఓ ఆసుపత్రిలో చేర్పించి డబ్బులు తీసుకెళ్లేందుకు తన ద్విచక్రవాహనంపై ఇంటికి తిరిగి వస్తుండగా మండల కేంద్రం కొణిజర్ల పోలీస్ స్టేషన్ సమీపంలో మధిర నుంచి ఖమ్మం వెళుతున్న ఆర్టీసి బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నాగేశ్వరరావు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతునికి భార్య సుష్మ, కూతుళ్లు ప్రియ, ప్రసన్న, అక్షయ ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## తిరునాళ్ళ మహోత్సవంలో పాల్గొన్న మెచ్చా



ప్రజాపక్షం/దమ్మపేట: దమ్మపేట మండలం, నల్లివారిగూడెం గ్రామంలో ఆదివారం జరిగిన శ్రీశ్రీశ్రీ పెద్దమ్మతల్లి అమ్మ వారి తిరునాళ్ళ మహోత్సవంలో మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి భాస్కర్, ఫణీంద్ర, సాయి, బాలరాజు, ఏదిరాజు శ్రీను, తేజవత్ శ్రీను, శివ భార్గవ్, కుంట వెంకటేష్, వంశీ తదితరులు ఉన్నారు.

## రాజమల్లుకు కాంగ్రెస్, ఐఎన్‌టీయూసీ ఘన నివాళి



**ప్రజాపక్షం/ఇల్లెందు:** దివంగత నేత మాజీ మున్సిపల్ ఛైర్మన్, ఐఎన్‌టీయూసీ మాజీ ఉపాధ్యక్షుడు చొప్పరి రాజమల్లు కు కాంగ్రెస్, ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాజమల్లు 14వ వర్ధంతిని పురష్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. ఓవైపు ఐఎన్‌టీయూసీ లేబర్ యూనియన్ మరోవైపు కాంగ్రెస్ పార్టీని ఒంటిచేత్తో నడిపించిన మహోన్నత నాయకుడు, కాంగ్రెస్ పార్టీని ఎన్నో పర్యాయాలు మున్సిపల్ ఎన్నికల్లో గెలిపించిన నాయకుడు రాజమల్లు అని గుర్తుచేశారు. ఏ కార్మికుడైనా అనారోగ్యంతో మృతి చెందినా..ప్రమాదవశాత్తు మృతి చెందినా..ఆ కుటుంబానికి అండగా నిలిచి సింగరేణి యాజమాన్యం నుంచి ఎక్స్‌గ్రేషియా ఇప్పించేవారని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు దొడ్డ డానియేల్, ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షుడు జె.వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ జాఫర్, వర్కింగ్ ప్రెసిడెంట్ సుదర్శన్ కోరి, గోచికొండ సత్యనారాయణ, ఇమామ్, మహబూబ్, నందకిశోర్, వచ్చా వెంకన్న, జెట్టి కిశోర్, ఐజాక్, కృష్ణ, చల్లా శ్రీనివాస్, బోళ్ల సూర్యం, కంచర్ల శ్రీనివాస్, మహిళా అధ్యక్షురాలు గాలిపల్లి స్వరూప, చెంచమ్మ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్యాలయ ఏర్పాటుకు స్థల సర్వే



**ప్రజాపక్షం/ అశ్వారావుపేట :** అశ్వారావుపేట మున్సిపాల్టీగా ఏర్పడి నాలుగు నెలలు పూర్తయినా పాలనపరమైన పరిపాలన అందించేందుకు పూర్తిస్థాయిలో కార్యాలయం అందుబాటులో లేకపోవడంతో అధికారులతో పాటు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో మున్సిపల్ కమీషనర్ కె.సుజాత నూతన కార్యాలయం ఏర్పాటుకు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులకు నివేదించగా ఈ మేరకు ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఆదేశానుసారం ఆదివారం మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి శ్రీనివాసరావు స్థల సేకరణకు సర్వే నిర్వహించారు. పట్టణంలోని సంతమార్కెట్ రింగ్ సెంటర్‌లోని పాత ఎంపిడిఓ కార్యాలయంతో పాటు పాత ప్రభుత్వ వైద్యశాల స్థలాలను పరిశీలించి సర్వే నిర్వహించారు. అన్ని విధాలుగా పాత ఎంపిడిఓ కార్యాలయం స్థలం నూతన మున్సిపల్ కార్యాలయ నిర్మాణానికి అనువుగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. అందుకు సంబంధించిన నివేదికను ఎమ్మెల్యేతో పాటు ఉన్నతాధికారులకు పంపనున్నట్లు తెలిపారు. ఇదిలా ఉండగా పాత ఎంపిడిఓ ప్రభుత్వ వైద్యశాఖ స్థలంను రైతు బజార్ ఏర్పాటుకు స్థానిక నాయకులు సిఫార్సు చేసినట్లు తెలిసింది. ఈ కార్యక్రమంలో నాయకులు జూపల్లి రమేష్, నంద్రు రమేష్, జూపల్లి ప్రమోద్, సిబ్బంది పాల్గొన్నారు.

## నూతన వధూవరులకు ఆశీర్వాదం



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** మండల పరిధిలోని పడమట నర్సాపురం గ్రామానికి చెందిన మొగిలిపువ్వు వెంకటేశ్వరరావు, స్వరాజ్యం కుమారుని అప్పారావు, సంధ్యల వివాహ వేడుకకు జూలూరుపాడు మండల కేంద్రంలోని ఆర్కే ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ వివాహ వేడుకకు ఉమ్మడి ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు, జూలూరుపాడు సొసైటీ మాజీ ఛైర్మన్ లేళ్ల వెంకటరెడ్డి, వెంగన్నపాలెం తాజా మాజీ ఎంపీటీసీ దుదుకూరి మధుసూదనరావు, తెలంగాణ ఉద్యమకారులు వేల్పుల నరసింహారావు, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు గోపాలరెడ్డి, బాదావత్ హరీష్, లచ్చిరాం నాయక్, వాంకుడోత్ సేవ్య, బోరం రమేష్‌లు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

## సింగరేణి కాంటాను అధికారులు పరిశీలన చేయాలి

**-బొగ్గు సప్లై చేసిన వారికి ఇన్ టైంలో కిరాయిలు ఇవ్వాలి**
**-సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి. అయోధ్య**




**ప్రజాపక్షం/మణుగూరు:** మణుగూరు లోని ఆదివారం నాడు సిపిఐ కార్యాలయంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి అయోధ్య తో మణుగూరు కోల్ ట్రాన్స్పోర్ట్, లారీ ఓనర్స్ అసోసియేషన్ వారు కలిసి లారీఓనర్లు జరుగుతున్న అవకతవకల మీద, లోడింగ్ విషయాల మీద చర్చించి వారి దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. ఈ సందర్భంగా బి అయోధ్య మాట్లాడుతూ సింగరేణిలో భూములు ఇల్లు కోల్పోయినటువంటి అనేకమంది నిర్వాసితులు, ఇతరులు ఫైనాన్స్ తీసుకొచ్చి లారీలు కొనుక్కొని సింగరేణి ద్వారా బొగ్గు సరఫరా చేస్తూ జీవనం సాగిస్తున్నారని, సింగరేణి లోడింగ్ సరిగా లేకపోవడం మూలంగా లారీ ఓనర్లు ఫైనాన్స్ కట్టలేక పోవడంతో అనేకమంది లారీలను లాకెళ్లడం జరుగుతుందన్నారు. లోడింగ్ సరిగా లేకపోవడం వలన పర్మిట్ తీసుకురాలేకపోతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మణుగూరులో కాటా లారీ బొగ్గు లోడింగ్ చేసి సీల్ వేసి లేబుల్ ప్రకారం కంపెనీ కి బొగ్గు పంపిస్తే అక్కడ అన్లోడ్ చేసే దగ్గర కాటా వేస్తే తేడా వస్తుందని సుమారు 4, లేక 5 వేల రూపాయలు లాస్ వస్తుందని సుమారు 6 కంపెనీలలో ఇదే పరిస్థితి నెలకొందని దీనివలన ట్రాన్స్పోర్ట్ ఇబ్బంది పడుతున్నారని కావున సంబంధిత సింగరేణి అధికారులు దీనిపై దృష్టిసారించి పరిశీలించాలని, బొగ్గు సప్లై చేసిన సరైన టైంలో ఓనర్లకు కిరాయిలు ఇవ్వకపోవడం వలన అనేక ఇబ్బందులు పడుతున్నారని కావున వీటన్నింటి పైన మణుగూరు సింగరేణి జిఎం, ఉన్నతాధికారులు పరిశీలించి వీరికి న్యాయం జరిగేలా చూడాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఐ పినపాక నియోజకవర్గం కార్యదర్శి సరెడ్డి పుల్లారెడ్డి, మణుగూరు పట్టణ కార్యదర్శి దుగ్యాల సుధాకర్, మణుగూరు కోల్ ట్రాన్స్పోర్ట్ చంద్రరావు ,వీ.కే.ఎం ప్రసాద్, మురళి, లారీ ఓనర్స్ అసోసియేషన్ సత్యనారాయణ, సురేందర్ రెడ్డి, గోవిందు, మిడిదొడ్ల నాగేశ్వరరావు, వెంకన్న బాబు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ములకలపల్లిలో పర్యటించిన ఎంఎల్‌ఏ జారే





**ప్రజాపక్షం/ములకలపల్లి:** ములకలపల్లి మండలంలో అశ్వారావుపేట ఎంఎల్‌ఏ జారే ఆదినారాయణ పర్యటించారు. మండలంలోని తాళ్ళపాయ పంచాయితీ రింగిరెడ్డిపల్లి గ్రామంలో గ్యాంగ్ వార్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మండల స్థాయి వాలీబాల్ పోటీలను ప్రారంభించి క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం చౌటుగూడెం గ్రామంలో జరుగుతున్న శ్రీశ్రీశ్రీ వీర్ల అంకమ్మ తల్లి నాగులమ్మ తల్లి రాజు గొడుగులు జాతర మహోత్సవంలో పాల్గొన్నారు. గ్రామస్తులు ఆయనకు శాలువాతో సన్మానించి, ఘనంగా స్వాగతం పలికారు. మార్గ మధ్యలో ఉన్న పాములేరు చప్టాపై ప్రతి సంవత్సరం వర్షపు నీరు రావటం వల్ల నాలుగు పంచాయితీలో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, గత సంవత్సరం పరిస్థితి గమనించిన ఆయన నూతనంగానే చప్టా నిర్మించాలని అధికారులను ఆదేశించగా, పనులు పూర్తి కావస్తున్న చప్టాను ఆయన సందర్శించారు. వర్షాకాలంలో వర్షాలు పెరగక ముందే చెప్టా ప్రజలకు అందుబాటులో తేవాలని అధికారులకు ఆదేశించారు. అనంతరం మండల కేంద్రంలో జరుగుతున్న సెంట్రల్ లైటింగ్ పనులను పరిశీలించారు. మురుగునీరు ఎక్కడ నిల్వ ఉండకుండా చూడాలని విద్యుత్ శక్తిగా అంతరాయం కలగకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆయన వెంట జిల్లా కాంగరెస్ నాయకులు బత్తుల అంజి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు తాండ్ర ప్రభాకర్, కారం సుధీర్‌కుమార్, కీసర సమ్మయ్య, సున్నం సుధాకర్, కుంజా రవి, కోండు భాస్కర్, కీసరి శ్రీను, మడకం యిరుమప్ప, గ్యాంగ్ వార్ యూత్ వాలీబాట్ టోర్నీ నిర్వాహకులు కొండ్రు అనిల్, చౌటుగూడెం ఆలయ కమిటీ పూజారి కాక ఆదినారాయణ స్వామి, కాక లక్ష్మి , శనగపాటి రవి, వింజర ఉమేష్, అశ్వారావుపేట నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు పాలకుర్తి సుమిత్, ములకలపల్లి మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కొడిమ వంశీ, అడ్వకేట్ ఊకే రవి, పాత్రికేయులు గడ్డం ఉదయ్‌కుమార్, ఆయా గ్రామాల పెద్దలు పాల్గొన్నారు.

## రైతాంగాన్ని విస్మరిస్తున్న కేంద్ర రాష్ట్ర పాలకులు

**జిల్లా ప్రథమ మహాసభలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర నాయకురాలు చంద్ర అరుణ**




**ప్రజాపక్షం/దమ్మపేట:** మన దేశంలో నేడు వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలో ఉందని, ఇది అంతర్గతంగా, బాహ్య ద్విముక దాడిని ఎదుర్కొంటుందని వీటిని పట్టించుకోకుండా మోడీ ప్రభుత్వం జాతీయ నూతన వ్యవసాయ మార్కెట్ బిల్లు, రైతు వ్యతిరేక మూడు నల్ల చట్టాలను తేవడం కోసం తీవ్రమైన ప్రయత్నం చేస్తుందని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర నాయకురాలు చంద్ర అరుణ అన్నారు. ఆదివారం ఏనుగు అప్పయ్య నగర్, వినాయక ఫంక్షన్ హాల్ లో జరిగిన అఖిలభారత ఐక్య రైతు సంఘం (ఏఐయుకెఎస్) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రథమ మహాసభ జిల్లా అధ్యక్షులు బుర్ర వెంకన్న అధ్యక్షతన జరిగిన మహాసభలు వారు ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయ రంగంలోకి విదేశీ పెట్టబడులను దేశ కార్పొరేట్ల అపరిమిత ప్రవేశం భారతీయ వ్యవసాయాన్ని కార్పోటీకరణ చేయడం కోసం చిన్న సన్న కారు మధ్యతరగతి రైతులను మన వ్యవసాయ సార్వభౌమత్వాన్ని నాశనం చేయడం జరుగుతుందని వారు అన్నారు. రైతుల ప్రస్తుత బాధలు వేతలు, ఆత్మహత్యలకు మూల కారణం బహుళ జాతి కంపెనీలు, దేశీయ కార్పొరేట్లు, గ్రామీణ భాగ్యవంతులు ముఖ్యంగా పెట్టుబడిదారీ దళారీల ప్రయోజనం కోసం రూపొందించబడిన, అమలు చేయబడిన మోడీ ప్రభుత్వ విధానమేనని వారు స్పష్టంగా తెలియజేశారు. అనంతరం రాష్ట్ర కార్యదర్శి వి.ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన వాగ్దానాలు మరిచి రైతాంగానికి వెన్నుపోటు పొడిచిందని రాష్ట్రంలో కలిపి విత్తనాలు కల్తీ ఎరువులను ఇస్తున్న వాటిపై ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని, ప్రభుత్వమే రైతంగానికి ఎరువులు విత్తనాలు అందించాలన్నారు. మహాసభ ప్రారంభం ముందు అరుణ పథకాన్ని సంఘం జిల్లా అధ్యక్షుడు బుర్ర ఎంకన్న ఎగురవేయగా జిల్లా కార్యదర్శి కల్లూరు కిషోర్ అమరవీరుల సంతాపాన్ని ప్రవేశ పెట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లా కార్యదర్శి ముద్దా బిక్షం, కార్యదర్శివర్గ సభ్యులు అమర్లపూడి రాము, గోకినపల్లి ప్రభాకర్, నూపా భాస్కర్,అఖిలభారత ఐక్య రైతు సంఘం జిల్లా నాయకులు ధర్మ, కంగాల కన్నయ్య,ఈసం శంకర్, బానోత్ పంతులు, డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు వీరబాబు, నకిరికంటి నాగేశ్వరరావు, ప్రగతి శీల మహిళా సంఘం జిల్లా (పిఓడబ్ల్యూ) కార్యదర్శి కెచ్చల కల్పన, తోడం దుర్గమ్మ, సావిత్రి అమర్లపూడి శరత్ తదితరులు పాల్గొన్నారు.

## పంపిణీకి సిద్ధమైన యూనిఫాం..!

**-మహిళా స్వశక్తి సంఘాలతో యూనిఫాం తయారీ**
**-మండలంలో 2980 మంది విద్యార్థులు**





**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పంపిణీ చేయనున్న యూనిఫామ్ తయారీలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం మహిళ స్వాసక్తి సభ్యులకు ఉపాధి కల్పించేలా చర్యలు చేపట్టింది. స్వయం సహాయక సభ్యులకు ఉపాధి కల్పించడంతోపాటు విద్యార్థులకు త్వరితగతిన యూనిఫాం లు అందించేలా ప్రణాళికలో చేపట్టింది. మండల మహిళా సమైక్య ఆధ్వర్యంలో మహిళా సంఘాల సభ్యుల చేత యూనిఫాంలో కుట్టిస్తు వారికి ఉపాధి కల్పించింది.

### యూనిఫాం సిద్ధం

మండలం లోని 58 ప్రభుత్వ పాఠశాలల్లో 1నుంచి 10వ తరగతి వరకు 2980 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరికి మొదటి దాకా యూనిఫాం అందించేందుకు మహిళా సంఘాల సభ్యులు సిద్ధం చేస్తున్నారు. ఇప్పటివరకు 80 శాతం యూనిఫాం పూర్తి కాగా మిగతాది మరో రెండు రోజుల్లో వంద శాతం పూర్తి చేయునట్లు అధికారులు తెలిపారు. మండలం లో టైలరింగ్ చేసే మహిళా సంఘాల సభ్యులను గుర్తించి వారికి క్లాత్ ను అందజేశారు. యూనిఫాం ఒక్కో జతకు రూ.75 చెల్లించారు. ఈ ఏడది సైతం అదే పద్ధతిలో యూనిఫాం లు సిద్ధం చేస్తున్నారు. ప్రభుత్వం మహిళా సంఘాలకు ఉపాధి కల్పించే దిశగా టైలరింగ్ నేర్చుకున్న వారికి యూనిఫామ్ తయారీ బాధ్యతలు అప్పగించడంతో మహిళా సంఘాల సభ్యులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

### పాఠశాల ప్రారంభం ముందే అందజేస్తాం : ఎంఈఓ బాలిన చలపతిరావు



మండలంలో ప్రభుత్వ పాఠశాలలో 1 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు మొదట ఒక జత జూన్ 2వ తేదీ నాటికి అందజేసేందుకు చర్యలు తీసుకుంటున్నాము.

### సంతోషంగా ఉంది : వేంకటలక్ష్మి మహిళా సంఘం సభ్యురాలు



యూనిఫామ్ కొట్టేందుకు అవకాశం కల్పించడంతో తమకు ఉపాధి లభించింది. ఉపాధితో పాటు గిట్టుబాటు ధరను అందించింది. టెండర్ల ద్వారా ఇతరులకు ఇవ్వకుండా మహిళా సంఘాలకు యూనిఫాం తయారీ అవకాశం కల్పించడం సంతోషంగా ఉంది.

### 80 శాతం యూనిఫాం సిద్ధం : ఏపీయం శ్రీనివాస్ రావు.

మండలంలో 58 పాఠశాలల్లో చదువుతున్న 2980 మంది విద్యార్థులకు మొదట దఫా కింద అందించినున్న వాటిలో 80 శాతం యూనిఫాం లు సిద్ధమయ్యాయి. మరో రెండు రోజుల్లో వంద శాతం పూర్తి చేసి సహా కాలంలో పాఠశాలల వారీగా అందజేస్తాం.

## చేతి వృత్తిదారుల సంక్షేమం కోసం కేంద్రం కృషి



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** చేతి వృత్తిదారుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తుందని బీజేపీ మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్ పేర్కొన్నారు. మండలం లోని రాయగూడెం లో ఆదివారం పీఎం విశ్వకర్మ పథకం కిట్ల ను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలతో ఆర్థిక స్వాలంభన సాధించాలని సూచించారు. చేతి వృత్తిదారులకు గుర్తింపును ఇచ్చి, వారికి ప్రత్యేకంగా కిట్లు ను అందించిన ఘనత బీజేపీ కి దక్కుతుందని అన్నారు. కేంద్రం అందించే పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అన్ని వర్గాల సంక్షేమం కోసం కేంద్రం అనేక, పథకాలు ప్రవేశపెడుతున్నట్లు తెలిపారు. కేంద్రం అందించే పథకాల పై క్షేత్ర స్థాయిలో విస్తతంగా ప్రచారం చేయనున్నట్లు తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అన్ని స్థానాలలో పోటీ చేసి విజయడంకా మోగించేందుకు సైనికుల్లా పనిచేయాలని సూచించారు. ప్రభుత్వ పథకాలే పార్టీ గెలుపు కు దోహదపడుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల ఉపాధ్యాక్షుడు కొండ హర్షవర్ధన్, కాళంగి వెంకటేశ్వర్లు, పోతనబోయిన శేషు, సూరేపల్లి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## కరకగూడెం మండలంలో కూలిపోయే దశలో వాగు బ్రిడ్జిలు





**ప్రజాపక్షం/కరకగూడెం:** కరకగూడెం మండలంలో బంగారు గూడెం, కుర్మపల్లి గ్రామాలలో మెయిన్ రహదారి లో ఉన్న వాగు బ్రిడ్జిలు గత మూడు సంవత్సరాల క్రితం కురిసిన భారీ వర్షాలకు కూలి పోయి, కృంగిపోతున్న దుస్థితి ఏర్పడింది. ఈ రోడ్డు మీదుగానే కుంగిన బ్రిడ్జిలను చూసుకుంటూ ప్రజా ప్రతినిధులు ప్రభుత్వ అధికారులు వెళుతున్నారే తప్ప వాటికి మరమ్మతులు చేయించాలనే ఆలోచన గాని, నూతన బ్రిడ్జి నిర్మాణాలు చేపట్టుటకు నిధులు కేటాయించడం కోసం కృషి చేయటం గాని కనిపించడం లేదు. ఈ మండలం పట్ల అధికారుల చిన్న చూపా... ప్రజాప్రతినిధులకు పట్టకనా.. రాబోయే కాలం వర్షాకాలం వాతావరణం లో మార్పులు చేరవేగంగా చెందుతుంది. అటువంటి ధర్నాలో ఈ వాగులు వరదలకు పూర్తిగా కొట్టుకపోతే రాకపోకలు పూర్తిగా బంద్ అవ్వాల్సి ఉంటుంది. కాబట్టి ప్రభుత్వ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించకుండావెంటనే ముందస్తు చర్యలు చేపట్టి రాకపోకలకు అంతరాయం కలగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా మండల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. లేనియెడల ఈ రోడ్డు రెండు వాగు బ్రిడ్జిలు గనుక కట్ అయిపోతే మండల ప్రజలతోపాటు తడవాయి వరంగల్ వెళ్లే వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుంది. కాబట్టి ప్రభుత్వ ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, పాలక ప్రభుత్వం స్పందించి నిధులు కేటాయించి వెంటనే పునర్నిర్మాణం పనులైన చేపట్టాలి లేదా నూతన బ్రిడ్జి నిర్మాణాలైనా చేపట్టాలని కోరుతున్నారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** అనంతారం గ్రామంలో గత నాలుగు రోజుల క్రితం గుండెపోటుతో మలకం వెంకటేశ్వర్లు మృతి చెందారు. కాగ మృతుడి ఇంటికి వెళ్లి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపి, రూ 5వేలను ఆర్థిక సహాయంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు కొర్సా రమేష్ అందించారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు ఉసికల వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు మలక వీరభద్రం, బండారు పుల్లారావు, పూనం రాధాకృష్ణ, బండారు నరేష్, పూనం నాగరాజు, కొరసా నాగేశ్వరరావు, కల్తీ హనుమంతు, పోగుల నరసింహారావు, పూనం పెద్ద నరసింహారావు, ఈసం పాపారావు, శేఖర్, ఏరాపా వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఆత్మ గౌరవాన్ని దెబ్బతీసిన సీఎం

**ప్రజాపక్షం/కారేపల్లి:** మిస్ట్ వరల్డ్ 2025 పోటీలో మిస్ ఇంగ్లాండ్ మిల్లా మాగీకి జరిగిన అన్యాయం ప్రతి తెలంగాణ పౌరులకు బాధించిందని మాజీ ఎంపీటీసీ జడల వసంత విమర్శించారు. మన రాష్ట్రానికి వచ్చిన అంతర్జాతీయ గుర్తింపును ఇలా నాశనం చేయడం చాలా బాధాకరమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్లక్ష్యం వల్ల ఈ పరిస్థితి వచ్చిందని, ఇది కేవలం ఒక వ్యక్తికి జరిగిన అన్యాయం కాదన్నారు. తెలంగాణ గౌరవానికి జరిగిన అవమానం కూడా ప్రభుత్వం బాధ్యతగా వ్యవహరించి ఉంటే ఇలాంటి ఘటన జరిగేది కాదన్నారు. మహిళల భద్రత, తెలంగాణ ప్రజల ఆత్మగౌరవం కాపాడటం ప్రభుత్వ ప్రధాన బాధ్యత అని, కానీ ప్రస్తుత ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. మిల్లా మాగీకి జరిగిన అన్యాయంపై వెంటనే విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, బాధితురాలికి న్యాయం జరగాలన్నారు. బిఆర్ఎస్ పార్టీ తరపున మేము ఈ సంఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామని, తెలంగాణ ప్రజల గౌరవాన్ని కాపాడే వరకు మేము పోరాడుతూనే ఉంటామన్నారు.

## సింగరేణి మండల టిడిపి మండల అధ్యక్షుడిగా మండేపూడి



**ప్రజాపక్షం/కారేపల్లి:** సింగరేణి మండల కేంద్రంలో మండల తెలుగుదేశం పార్టీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా పార్టీ అధ్యక్షులు, నియోజకవర్గ పరిశీలకులు రామనాథం హాజరయ్యారు. వారి ఆధ్వర్యంలో అన్ని గ్రామ శాఖలు వేశారు. గ్రామ శాఖ అధ్యక్షులు అందరూ కూడా ఏకగ్రీవంగా మండేపూటి శ్రీనివాసరావుని మండల పార్టీ అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఈసందర్భంగా మండేపూడి శ్రీనివాసరావు మాట్లాడుతూ నాపై నమ్మకంతో మండల పార్టీ అధ్యక్షులు ఇచ్చినందుకు పార్టీ అభివృద్ధి కోసం కార్యకర్తల శ్రేయస్సు కోసం పాటుపడతానని తెలిపారు. ఈకార్యక్రమంలో టిడిపి పార్టీ జిల్లా నాయకులు గంగారబోయిన శ్రీనివాస్, మధు, చిన్ని శ్రీనివాస్‌పాల్గొన్నారు.

## నూతన కార్యవర్గ ఎన్నిక



**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** ఎర్రుపాలెం మండల కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని మీనవోలు నాలెడ్డ్ సెంటర్‌లో ఆదివారం ఎన్నుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షునిగా కర్నాటి సుధాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా శీలం చిన్నహనుమంతరెడ్డి, మానికొండకృష్ణప్రసాద్, కార్యదర్శి పత్తిపాటి భాస్కర్‌రావు, ట్రెజరర్‌గా కేతేపల్లి ఫణికుమార్, ఎగ్జిక్యూటీవ్ మెంబర్స్‌గా మల్లవరపు గోపాలరావు, బండారు ఆంజనేయులను ఎన్నుకోవటం జరిగింది.

# ఉపాధి కూలీలకు నీరు..నీడ..మెడికల్ కిట్టు ఎక్కడ..?

**-ప్రాణాలు పోతేనే వసతులు ఏర్పాటు చేస్తారా..?**
**-ఎండకు ఉక్కిరిబిక్కిరి అవుతున్న ఉపాధి కూలీలు**





ప్రజాపక్షం/వైరా: ఉపాధి కూలీలకు నీరు లేదు. నీడ లేదు. ఉపాధి కూలీలకు ఉపాధి పనులు వద్ద ఎలాంటి భద్రత లేదు. కనీస వసతులు కూడా కరువయ్యాయి. ఉపాధి పనికి వెళ్లిన కూలీలకు ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పనిచేసే ప్రాంతంలో త్రాగు నీరు ఉండదు. నిలవడానికి నీడ ఉండదు. ప్రమాదం జరిగితే మెడికల్ కిట్టు ఉండదు. ఇది ఉపాధి కూలీల పరిస్థితి. ఇంటి నుంచి పనికి వెళ్లే ఉపాధి కూలీలు వారి వెంట లీటర్ నుండి రెండు లీటర్ల త్రాగునీరుని తీసుకొని పోతారు. పనిచేసే సమయంలో అవి ఎక్కడ అయిపోతాయి అని కొసిరి కొసిరి వాటిని తాగుతూ ఉంటారు. కొద్దిసేపు ఎక్కడైనా స్వేదతీర్చుకుందాం అని అనుకుంటే నీడ కరువైంది. పనుల వద్ద కనిపించని టెంట్లు. దీంతో ఎండలోనే ఆ పొలం వద్ద కూర్చొని పరిస్థితి వారికి ఏర్పడింది. సరైన మెడికల్ కిట్లు కూడా ఉపాధి పని వద్ద కనిపించడం పోవడం జరుగుతుంది. ప్రతి గ్రామంలో పెద్ద ఎత్తున ఉపాధి పనికి పోతూ ఉన్నారు. పని వద్దకు వెళ్లిన కూలీలకు ఎండ తీవ్రతతో డిహైడ్రేషన్ అయితే అక్కడ వారికి అందించడానికి ఓఆర్ఎస్ ప్యాకెట్లు కూడా అందుబాటులో ఉండటం లేదు. ఇలా చెప్పుకుంటూ పోతే ఉపాధి కూలీలకు నీరు నీడ వైద్యం అందుబాటులో లేదని చెప్పవచ్చును. గత కొన్ని నెలలుగా ఉపాధి కూలీల వద్ద ఏర్పాటు చేయాల్సిన టెంటు సరఫరాలు కూడా నిలిపివేబూరు. ఎవరైనా ప్రశ్నిస్తే దానికి సమాధానం ఉండదు.




దీనిపై పట్టించుకోవాల్సిన అధికార యంత్రాంగం ఏమైపోతుంది. ఉపాధి పని వద్ద త్రాగునీటి సరఫరా చేయాల్సిన బాధ్యత ఎవరిది? కూలీలు స్వేదతీర్చుకునేందుకు నీడను కల్పించాల్సిన బాధ్యత ఎవరిది? ఏదైనా ప్రమాదం జరిగితే అక్కడ ఫస్ట్ ఎయిడ్ చేసేందుకు కావాల్సిన మెడికల్ కిట్టు ఏమైంది? గత కొన్ని రోజులుగా ఎండలు విపరీతంగా మండిపోతున్నాయి. ఈ ఎండలకు ఉపాధి కూలీలు ఉక్కిరిబిక్కిరితో అల్లాడిపోతున్నారు. పనికి పోకుండా ఉండాలంటే ఆర్థిక ఇబ్బందులు గుర్తు చేస్తున్నాయి. గ్రామాల్లో జరిగే ఉపాధి పనుల వద్ద పర్యవేక్షించాల్సిన బాధ్యత మండలంలో ఎవరిది? ఆయా మండలాల్లో ఉపాధి హామీ అధికారులు ఏమైపోతున్నారు. కేవలం ఫీల్డ్అసిస్టెంట్‌లకే బాధ్యతలు ఇస్తున్నారే తప్ప ఆ ఫీల్డ్ అసిస్టెంట్‌లకు వసతుల గురించి ఎందుకు ఆదేశాలు ఇవ్వడం లేదు. దీనిపై ఎందుకు మౌనం వహిస్తున్నారు. ఉపాధి పని వద్ద కూలీలు ప్రాణాలు పోతేనే స్పందిస్తారా ఒక్కసారి ఆలోచించండి. ఉపాధి పనికి పోయిన ప్రతిఒక్కరికి అన్ని వసతులు ఏర్పాటు చేసేవిధంగా ఉండాలి. వారి ఆరోగ్యానికి భద్రత ఇచ్చే విధంగా అధికారులు పనితీరు కనిపించాలి. వారు ఆరోగ్యంగా లేకపోయి ఏదైనా ప్రమాదం అక్కడ జరిగితే ఆ కుటుంబ పరిస్థితి ఏ విధంగా ఉంటుంది. ఇప్పటికైనా జిల్లా అధికారులు సంబంధిత ఉపాధిహామీ అధికారులు, ఉపాధి పనుల వద్ద కూలీలకు త్రాగునీరు నీడ వైద్యసేవలు మెడికల్ కిట్లు ఏర్పాటు చేసే వారికి అండగా నిలవాలని ప్రజలు కోరుకుంటున్నారు.

# ఉద్యోగులకు ఆటవిడుపు ఎంతో హాయినిస్తుంది


**- ఐటిడిఏ పిఓ రాహుల్**



ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : నిత్యం ఉద్యోగ విధుల్లో సతమతమవుతూ, కనీసం కుటుంబానికి కూడా సమయాన్ని వెచ్చించే తీరకలేని ఉద్యోగులు సరదాగా ఒక రోజు ఆటవిడుపుగా క్రీడలు ఆడుకోవడం ఎంతో హాయినిస్తుందని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ అన్నారు. ఆదివారం పాల్వంచలోని కిన్నెరసాని క్రీడా మైధానంలో ఉద్యోగులతో కలిసి ఆయన క్రికెట్ పోటీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పిఓ మాట్లాడుతూ కార్యాలయంలో పనిచేసే అధికారులతో పాటు సిబ్బంది విధి నిర్వహణలో అలసి సొలసిపోతున్నారని, సరదాగా నిర్వహించుకునే ఇలాంటి క్రీడలు ఎంతో సంతోషాన్ని ఇస్తాయని చెప్పారు. శారీరక, మానసిక ఒత్తిడి నుండి ఉపశమనం ఉంటుందని, అప్పుడప్పుడు ఇలాంటి క్రీడల్లో పాల్గొంటూ సిబ్బంది హాయిగా గడపాలని చెప్పారు. స్పోర్ట్స్ ఆఫీసర్ గోపాలరావు నేతృత్వంలో నిర్వహించిన ఈ పోటీలో విన్నర్స్, రన్నర్స్‌కు, ఆటలో పాల్గొన్న ప్రతీ ఒక్కరికి పిఓ బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో దమ్మపేట ఏటిడిఓ చంద్రమోహన్, ఏఎస్ఓ వెంకటనారాయణ, నాగేశ్వరరావు, శంకర్, బాలు, వెంకటేశ్వర్లు, హరికృష్ణ, కబీర్ తదితరులు పాల్గొన్నారు.

# అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం : అక్రమంగా నిల్వ ఉంచిన సుమారు 10 క్వింటాళ్ళ రేషన్ బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్న సంఘటన మండల పరిధిలోని దమ్మాయిగూడెం పిండిప్రోలు గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం దమ్మాయిగూడెం గ్రామానికి చెందిన వడ్డెబోయిన నరేష్ ఇంటి ముందు గుర్తు తెలియని వ్యక్తులు సుమారు 10 క్వింటాళ్ళ రేషన్‌బియ్యం నిల్వ ఉంచగా సమాచారం తెలుసుకున్న టాస్క్‌ఫోర్స్ సిఐ కిరణ్‌కుమార్ తన సిబ్బందితో రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిల్వ ఉంచిన గుర్తు తెలియని వ్యక్తుల వివరాల కోసం స్థానికులను అడిగి తెలుసుకున్నారు. తెలంగాణ ప్రభుత్వం నిరుపేదల కోసం సన్నబియ్యాన్ని అందిస్తుడటంతో అక్రమ రేషన్ బియ్యం దందా సాగుతుందని, సివిల్



సప్లయి, రెవెన్యూ అధికారులు, పోలీసులు అక్రమ రేషన్ బియ్యాన్ని అరికట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

# రామయ్యను దర్శించుకున్న ఎంఎల్‌సి అద్దంకి దయాకర్



ప్రజాపక్షం/భద్రాచలం : శ్రీసీతారామ చంద్ర స్వామివారి ఆలయాన్ని ఎంఎల్‌సీ అద్దంకి ద.యాకర్ ఆదివారం సతీ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ మర్యాదలప్రకారం స్వాగతం పలికారు. గర్భగుడిలోని స్వామికి ప్రత్యేక పూజలు చేసిన ఆయన ఆలయం ప్రాంగణంలోని శ్రీ లక్ష్మీ తాయారమ్మ వారు, అభయాంజనేయ స్వామివర్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ విశిష్టత గూర్చి అర్చక స్వాములు వారికి వివరించారు. ఆలయం తరుపున షాలువ కప్పి సత్కరించి జ్ఞాపికను అందజేసారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట పలువురు ఉన్నారు.

# రామయ్యను దర్శించుకున్న ఆర్‌టిఐ కమీషనర్ పివి శ్రీనివాస్ దంపతులు



ప్రజాపక్షం/భద్రాచలం : భద్రాచల శ్రీ సీతారామ చంద్ర స్వామివారి దేవస్థానాన్ని ఆర్‌టిఐ కమీషనర్ పివి శ్రీనివాస్ సతీ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ మర్యాదలప్రకారం ఆదివారం ఘన స్వాగతం పలికారు. గర్భగుడిలోని స్వామికి ప్రత్యేక పూజలు చేసిన దంపతులు ఆలయం ప్రాంగణంలోని శ్రీ లక్ష్మీ తాయారమ్మ వారు, అభయాంజనేయ స్వామివార్లను సైతం దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ విశిష్టత గూర్చి అర్చక స్వాములు వారికి వివరించిన అనంతరం షాలువ కప్పి సత్కరించి జ్ఞాపికను అందజేసారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట పలువురు ఉన్నారు.

# ఆర్‌టిఐ కమీషనర్‌ను మర్యాద పూర్వకంగా కలిసిన కలెక్టర్



ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : ఆర్‌టిఐ కమీషనర్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టి జిల్లాకు విచ్చేసిన పివి శ్రీనివాస్‌ను జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆదివారం స్థానిక సింగరేణి గెస్ట్‌హౌస్‌లో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు మొక్కను బహుకరించారు. జిల్లాకు మొదటి సారి విచ్చేసినందుకు జిల్లా ప్రజల తరుపున కృతజ్ఞతలు చెప్పారు.

# సమాచారహక్కు చట్టం వజ్రాయుధం



**- ఆర్‌టిఐ కమీషనర్ పివి శ్రీనివాస్**
**- ఘన పౌరసన్మానం**

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** సమాచార హక్కు చట్టం సామాన్యుని చేతిలో వజ్రాయుధం అని, దీనిని అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులోనికి తెచ్చేందుకు కృషి చేయనున్నట్లు ఆర్‌టిఐ కమీషనర్ పివి శ్రీనివాస్ అన్నారు. జిల్లా కేంద్రంలోని లక్ష్మి దేవిపల్లిలోని ఎస్ఎస్ కన్వెన్షన్ హాల్లో భద్రాద్రి కొత్తగూడె జిల్లా జర్నలిస్టులు, ఆత్మీయుల ఆధ్వర్యంలో ఆయనకు ఘన పౌర సన్మానాన్ని చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ పేపర్‌బాయి స్థాయి నుండి తెలంగాణ సమాచార హక్కు కమీషనర్‌గా సాగిన సుదీర్ఘ ప్రస్థానాన్ని ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఎన్నో సమస్యలతో ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితుల్లో నేటికి 50శాతం మంది జనాలు మగ్గిపోతున్నారని, సామాన్యుని గళానికి దక్కిన గౌరవమే ఈ సమాచారశాఖ ఆర్‌టిఐ కమీషనర్ పదవని, సామాన్యుని సమస్యలు తీరేంత వరకు జవాబుదారీగా ఉంటూ ప్రజలందరికీ అందుబాటులోకి ఈ చట్టాన్ని తీసుకురానున్నట్లు చెప్పారు. తనపై ప్రభుత్వం ఎంతో నమ్మకంతో ఈ పదవిని అప్పగించిందని, ప్రభుత్వ ప్రతిష్ట ఎక్కడా దెబ్బతినకుండా కృషి చేయనున్నట్లు చెప్పారు. అనంతరం ఆయన సతీమణి సృజన మాట్లాడుతూ అట్టడుగు స్థాయి నుండి నేడు ఆర్‌టిఐ కమీషనర్‌గా ఆయన బాధ్యతలు చేపట్టడం ఆనందంగా ఉందంటూనే కుటుంబానికి సమయాన్ని కేటాయిస్తారో లేదో అన్నారు. ఉద్యమనేపథ్యం గల పివి శ్రీనివాస్ పదవికి వన్నె తెస్తారనే నమ్మకం ఉందన్నారు. ఉద్యమ సహచరిగా శ్రీనివాస్ ప్రస్థానాన్ని తెలియజేస్తూ సృజన ఆ చల్లని సముద్ర గర్భం పాటపాడిన ఆలరింపజేశారు. అనంతరం పలువురు మాట్లాడుతూ సరైన వ్యక్తి సరైన పదవి దక్కిందని ప్రశంసలు కురిపించారు. అనంతరం టియూడబ్ల్యూజే ఐజేయు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు ఇమంది ఉదయ్ కుమార్ మాట్లాడుతూ దిక్కార స్వరానికి అరుదైన గౌరవం దక్కిందని, జర్నలిస్టుగా తన పాత్రను నూటికి నూరు శాతం పోషించారన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు,మాజీ ప్రజాప్రతినిధులు, వ్యాపారులు, ఉద్యోగులు, జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.

# జంగాల కాలనీ ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతాం



**ఎమ్మెల్యే డా.మట్టా రాగమయి**

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** జంగాల కాలనీ ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతామని సత్తుపల్లి శాసన సభ్యురాలు డా.మట్టా రాగమయి అన్నారు. పట్టణంలోని 13 వ వార్డ్ జవహర్ నగర్ లో గల జంగాల కాలనీలో రూ. 14 లక్షలతో ఏర్పాటు చేస్తున్న సుమారు 80 విద్యుత్ స్థంభాలకు కాలనీ వాసులతో కలిసి ఎమ్మెల్యే రాగమయి శనివారం రాత్రి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గత 15 సంవత్సరాలుగా జంగాల కాలనీ అభివృద్ధికి నోచు కోక చీకటిమయమైందని, గత ఎన్నికల్లో వారికి ఇచ్చిన మాట ప్రకారం వారి కాలనీకి, కాలనీ ప్రజల జీవితాల్లోకి వెలుగులు నింపే దిశగా అడుగులు వేస్తున్నామన్నారు. పేదల ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికి న్యాయం జరుగుతుందని, తమను గెలిపించిన, తమపై నమ్మకంతో ఓటు వేసిన ప్రతి ఒక్కరికి అభివృద్ధి , సంక్షేమ పథకాలు అందేలా చేస్తామన్నారు. ఈ సంసర్భంగా కాలనీ వాసులు ఎమ్మెల్యే రాగమయికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం లో సత్తుపల్లి మార్కెట్ కమిటి చైర్మన్ దోమ ఆనంద్ బాబు, సత్తుపల్లి పట్టణం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాదె చెన్నారావు, సత్తుపల్లి మున్సిపల్ వైస్ చైర్మన్ తోట సుజాల రాణి, సీనియర్ నాయకులు చల్లగుళ్ల నరసింహ రావు, కమల్ పాషా, మానుకోట ప్రసాద్, మున్సిపల్ కమీషనర్ నరసింహ, విద్యుత్ శాఖ డిఈ రాములు,ఏఈ శరత్, జవహర్ నగర్, జంగాల కాలనీ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# పీడిత ప్రజల విముక్తి కోసం పోరాడిన ధన్యజీవి నల్లమల




**సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు**
**దండు ఆదినారాయణ**

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** భూమి కోసం, భుక్తి కోసం, పీడిత జన విముక్తి కోసం, దున్నేవాడికే భూమి కావాలని నిరంతరం పేదల కోసం పోరాడిన ధన్యజీవి నల్లమల గిరిప్రసాద్ అని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దండు ఆదినారాయణ కొనియాడారు. కామరెడ్డి నల్లమల్ల గిరిప్రసాద్ 29వ వర్ధంతి సభ సత్తుపల్లిలో ఘనంగా నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో దండు ఆదినారాయణ మాట్లాడుతూ ఉన్నతమైన చదువుని వదులుకుని, అన్ని రకాల అవకాశాలు ఉన్నా పీడితి ప్రజల కోసం పనిచేయాలని తలంపుతో కమ్యూనిస్టు పార్టీ సభ్యుడుగా మారి, ఆ తర్వాత అంచలంచెలుగా ఎదిగి రాజ్యసభ సభ్యులుగా, సిపిఐ ఆల్ ఇండియా ఉప కార్యదర్శిగా అనేక బాధ్యతలు నిర్వర్తించి, తుపాకీ గుండు మచ్చ తప్ప, ఎటువంటి మచ్చలేని మహానాయకుడుగా అనేక పోరాటాలకు నాయకత్వం వహించి తెలంగాణ సాయుధ పోరాటంలో ఘనమైన పాత్ర పోషించారని, ఆయన చూపించిన మార్గంలో పయనించటమే మనం ఆయనకు ఇచ్చే ఘనమైన నివాళన్నారు. ముందుగా గిరి ప్రసాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి పట్టణ కార్యదర్శి నిమ్మటూరి రామకృష్ణ, మండల కార్యదర్శి, సిపిఐ పట్టణ నాయకులు పాలకుర్తి వీరయ్య, ఫుట్‌పాత్ వ్యాపారుల సంఘం నాయకులు అయినంపూడి ప్రభాకర్, కృష్ణ, రాంబాబు, వీర్రాజు, వెంకట్రావమ్మ, జయమ్మ, మణెమ్మ, రాములమ్మ, సత్యనారాయణ, వెంకటేశ్వర్లు, శివ తదితరులు పాల్గొన్నారు.

## వెల్డింగ్ వర్క్‌షాప్‌ను
# ప్రారంభించిన ముళ్ళపాటి



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ శాంతినగర్‌లో బానోతు సక్రు నూతనంగా నెలకొల్పబడిన శ్రీలక్ష్మి తిరుపతమ్మ వెల్డింగ్ వర్క్స్‌ను మాజీ మున్సిపాల్ వైస్ చైర్మన్ ముళ్ళపాటి సీతారాములు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరికి అందుబాటులో ఉంటూ గణనీయమైన ప్రగతిలో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వ్యాపారవేత్త కొమిరిశెట్టి శ్రీధర్, మున్సిపాల్ కోఆప్షన్ మాజీ సభ్యులు అప్పం సురేష్, లక్ష్మీ తిరుపతమ్మ వర్క్‌షాప్ ప్రొప్రైటర్ బానోతు సక్రు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల
# ఆత్మీయ సమ్మేళనం



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** ఖమ్మంరూరల్ మండలంలోని గోళ్లపాడుపోలేపల్లిఉన్నత పాఠశాలలో 200506సంవత్సరంలో పదో తరగతిచదవిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించుకున్నారు. దీనిని అక్కడి ఓ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసుకుని, ఆనాటి గురువులను సత్కరించుకున్నారు. అలాగే 20సంవత్సరాల తర్వాత ఒకచోట కలుసుకుని పూర్వ విద్యార్థులు ఒకరిని ఒకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. అలనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమంలో గురువులు శ్రీనివాస్‌రావు, వెంకట్‌రెడ్డి, శ్యామ్‌సుందర్, భాస్కర్‌రావు, రాధా, విద్యార్థులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో
# తల్లీకొడుకు మృతి

**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** రోడ్డు ప్రమాదంలో తల్లి, కొడుకు మృతిచెందిన సంఘటన మండల పరిధిలోని బూడిదంపాడు సమీపంలో ఆదివారం చోటు చేసుకుంది. కామేపల్లి మండలం జాస్తిపల్లికి చెందిన బత్తుల వెంకటస్వామి భార్య బత్తుల శారద (31), కుమారుడు కార్తీక్ (12) తో కలిసి ద్విచక్ర వాహనంపై ఖమ్మంలో ఓ శుభకార్యానికి వచ్చాడు. సాయంత్రం స్వగ్రామం జాస్తిపల్లికి వెళ్తుండగా బూడిదంపాడు సమీపంలో పవర్‌గ్రిడ్ వద్ద రోడ్డుకు కుడి వైపున తాటి ముంజల కోసం వెళ్లారు. ముంజలు తీసుకుని ద్విచక్ర వాహనం పై బయలు దేరుతుండగా ఖమ్మం నుంచి ఇల్లందు వైపు వెళ్తున్న కారు అతి వేగంగా వచ్చి వారిని ఢీకొంది. వీరితో పాటు తాటి ముంజలు విక్రయిస్తున్న వ్యక్తికి కూడా తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వారిని ఆసుపత్రికి తరలించగా భార్య శారద, కుమారుడు కార్తీక్ మృతిచెందాడు. తీవ్ర గాయాలతో వెంకటస్వామి చికిత్స పొందుతున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# సుజాతనగర్‌లో చోరీ

**ప్రజాపక్షం/సుజాతనగర్:** సుజాతనగర్ మండల కేంద్రంలోని బాలాజీ నగర్ లో శనివారం రాత్రి రెండు ఇళ్లలో దొంగతనం జరిగింది. కూరపాటి రాజేంద్రప్రసాద్ అనే వ్యక్తి ఇంట్లో సుమారు 4.4 తుల బంగారపు వస్తువులు, 44 తులాల వెండి వస్తువులు, రూ 30,000 నగదు దొంగలించారు. అదే వెంచర్లో ఉన్న నాయుడు సతీష్ అనే వ్యక్తి ఇంట్లో కూడా 7 తులాల వెండి వస్తువులు, రూ.5,000 నగదు దొంగలించారు. ఫిర్యాదుదారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సుజాతనగర్ ఎస్సై మాలోత్ రమాదేవి కేసు నమోదు చేసి , క్లూస్ టీం సిసి టివి ఫుటేజ్ ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ రమాదేవి మాట్లాడుతూ సుజాతనగర్ ప్రాంతంలో ఎవరైనా అనుమానిత వ్యక్తులు కనిపిస్తే 100 ద్వారా గాని లేదా నేరుగా పోలీస్ స్టేషన్ కి వచ్చి గానీ సమాచారం ఇవ్వాలని తెలిపారు.